క్లుప్తంగా

నేడు గృహసారథులకు అవగాహన

కలకడ : మండలంలో కేంద్రంలో గురువారం గ్రామ వలంటీర్లు, గృహసారథులకు నిర్వహించే అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరవుతారని వైఎస్సార్‌ సీపీ కన్వీనర్, సింగిల్‌విండో అధ్యక్షులు కమలాకర్‌రెడ్డి తెలిపారు. అనంతరం కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి గ్రామాల వారి అభివృద్ధి, నిధులు, పలు సూచనలు, సలహాలు ఇస్తారని పేర్కొన్నారు.

26న మండల సమావేశం

కలకడ : స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన 26న మండల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో అన్ని శాఖల ప్రగతి నివేదికలు, అభివృద్ధి, సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ఘన నివాళి

వాల్మీకిపురం: బ్రిటీష్‌ ప్రభుత్వ దుష్టపాలనపై తిరుగుబాటు చేసిన ప్రథమ స్వాతంత్య్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి జేవీవీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. బుధవారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని మండలంలోని చింతపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు ప్రభుచరణ్‌ మాట్లాడుతూ 1857నాటి భారత స్వాతంత్య్ర పోరాటానికి పదేళ్ల ముందే బ్రిటీష్‌ దుష్టపాలనపై ఎదిరించిన తెలుగు వీరుడన్నారు.

చిన్నారితో సహా వివాహిత అదృశ్యం



షాహిద, కుమారుడు సమీర్‌ బాషా (ఫైల్‌)

కలికిరి: చిన్నారితో సహా వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్‌ పూల మనోహర్‌ తెలిపారు. పోలీసుల కథనం మేరకు... కలికిరి పట్టణ పరిధిలోని బీడీ కాలనికి చెందిన ఎస్‌.సోహైల్‌ బాషా భార్య ఎం.షాహిద(20), కుమారుడు ఎస్‌.సమీర్‌ బాషా(3) ఇద్దరు మంగళవారం ఉదయం నుంచి కనపడలేదని బుధవారం పోలీసులను ఆశ్రయించాడు. సోమవారం రాత్రి ఇంట్లో పడుకున్నామని, ఉదయం లేచి చూసే సరికి భార్య, కుమారుడు కనపడకుండా పోవడంతో తెలిసిన వారిని, బంధువులను విచారించినా వారి ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు హెడ్‌కానిస్టేబుల్‌ తెలిపారు.

పాత నేరస్తుల బైండోవర్‌

మదనపల్లె : ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పాత నేరస్తులు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులను మండల తహసీల్దార్‌ వద్ద బైండోవర్‌ చేసినట్లు టూటౌన్‌ సీఐ మురళీకృష్ణ తెలిపారు. బుధవారం టూటౌన్‌ పోలీస్‌స్టేషన్‌ ఆవరణలో పాత నేరస్తులను పిలిపించి కౌన్సెలింగ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాత నేరస్తులు ఏదైనా నేరాలకు పాల్పడినా, గొడవలు సృష్టించినా చట్టపరమైన కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

భూ సరిహద్దు రాళ్లు సక్రమంగా ఏర్పాటు చేయాలి

తంబళ్లపల్లి: మండలంలో జగనన్న శాశ్వత భూ హక్కు, సమగ్ర భూ సర్వే పూర్తియిన గ్రామాలలో రైతుల భూములకు సరిహద్దు రాళ్లు సక్రమంగా ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌ కళావతి కోరారు. బుధవారం సమగ్ర భూ సర్వే మొదటి విడతలో పూర్తయిన కన్నెమడుగు, ఎర్రసానిపల్లిలో భూమి సరిహద్దు రాళ్ల ఏర్పాటు ప్రక్రియను పరిశీలించారు. సరిహద్దు రాళ్ల ఏర్పాటు త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మదనపల్లె సర్వే ఆఫ్‌ డెప్యూటీ ఇన్‌స్పెక్టర్‌ లక్ష్మీనారాయణ, మండల సర్వేయర్‌ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్యం

కురబలకోట: గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ నోడల్‌ అధికారి విజయ్‌కుమార్‌ సూచించారు. బుధవారం ఆయన కురబలకోట ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. రికార్డులు, ఆసుపత్రి పరిశీలన అనంతరం మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎప్పటికప్పుడు రక్తపరీక్షలు నిర్వహించాలన్నారు. రక్తహీనత లేకుండా చూసుకోవాలన్నారు.

పరిశోధనకు నెలవుగా
సంజయ్‌గాంధీ డిగ్రీ కళాశాల

- పలువురికి పీహెచ్‌డీ, ఎంఫిల్‌ పట్టాలు
- పలు విభాగాల్లో పరిశోధనా కేంద్రాలు
- 20 వేల పుస్తకాలతో కూడిన గ్రంథాలయం



పీలేరు రూరల్‌ : గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో 1980లో పీలేరులో ఏర్పాటు చేసిన సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిశోధనకు నెలవుగా మారింది. దినదినాభివృద్ధి చెందుతూ కొత్త కోర్సులకు రూప కల్పన చేస్తూ, మరోవైపు పరిశోధనా కేంద్రంగా మారింది.

కళాశాలలో చేపట్టిన పరిశోధనలు...

- 2009లో అప్పటి ప్రిన్సిపాల్‌ టి.వి. మంజులతాదేవి ఆధ్వర్యంలో చరిత్ర విభాగంలో ఇద్దరు పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టాలు పొందారు.
- రసాయన శాస్త్ర విభాగంలో డాక్టర్‌ డి. వెంకటరమణారెడ్డి పర్యవేక్షణలో ముగ్గురు ఎంఫిల్, ఇద్దరు పీహెచ్‌డీ పట్టాలు పొందారు. ఇందులో డాక్టర్‌ జీవనజ్యోతి ప్రస్తుతం విశాఖపట్నం జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు.
- జంతు శాస్త్ర విభాగంలో డాక్టర్‌ పి. హనుమంతురాజు పర్యవేక్షణలో ఎంఫిల్‌ పరిశోధన జరిగింది. ప్రస్తుత ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఎం. సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇద్దరు ఎంఫిల్‌ పట్టాలు పొందారు.
- కంప్యూటర్స్‌ విభాగంలో డాక్టర్‌ బి. కవిత ఆధ్వర్యంలో ఇద్దరు పీహెచ్‌డీ పట్టాను పొందారు.

కొత్తగా పరిశోధనా కేంద్రాలు...

- 2020లో కామర్స్‌ అధ్యాపకులు డాక్టర్‌ ఎం. వెంకటరమణయ్య ఎస్వీయూకి సమర్పించిన ప్రతిపాదనలు ఆమోదించడంతో కామర్స్‌ విభాగానికి కొత్తగా పరిశోధన కేంద్రం మంజూరైంది.
- తెలుగు అధ్యాపకులు డాక్టర్‌ కె. శ్రీనివాసులురెడ్డిని పరిశోధనా పర్యవేక్షకులుగా శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం గుర్తించింది.

పలు కీలక సదస్సులు...

కళాశాలలో పరిశోధనలో పలు కీలక సదస్సులు న్విహించారు. కేంద్ర ప్రభుత్వం నేతృత్వంలోని సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ విభాగంలో ఐదు ఇన్‌స్పైర్‌ కార్యక్రమాలు నిర్వహించారు. ఉన్నత పాఠశాల, జూనియర్‌ కళాశాల విద్యార్థుల దృష్టిని శాస్త్ర సాంకేతిక రంగాలపై మళ్లించడమే లక్ష్యంగా నాలుగు జాతీయ సదస్సులు నిర్వహించారు. బయోపాలిమర్స్‌ అంశంపై సూక్ష్మజీవి శాస్త్ర విభాగంలో యూజీసీ ఆర్థిక సహకారంతో జాతీయ సదస్సు నిర్వహించడంతోపాటు పరిశోధనా పత్రాలు పుస్తక రూపంలో ప్రచురించింది. కామర్స్‌ విభాగం ఆధ్వర్యంలో డిజిటల్‌ ఎకానమీ, ఆత్మ నిర్భయ భారత్‌ అంశాలపై జాతీయ సదస్సులు న్యూఢిల్లీ ఐసీఎస్‌ఎస్‌ఆర్‌ ఆర్థిక సహకారంతో నిర్వహించారు. ఇటీవలే జాతీయోద్యమంలో తెలుగు పత్రికలు, జర్నలిజం పాత్ర అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. కళాశాలలో పరిశోధకులకు వీలుగా 20 వేల పుస్తకాలతో కూడిన విశాలమైన గ్రంథాలయం, కంప్యూటర్లు, ఇంటర్‌నెట్‌ సౌకర్యం అందుబాటులో ఉంది.

ఎంఫిల్, పీహెచ్‌డీ పట్టాలు పొందిన వారి సంఖ్య

విభాగం	సంఖ్య
చరిత్ర	02
కెమిస్ట్రీ	02
కంప్యూటర్‌ సైన్స్‌	02
జువాలజీ	02
కామర్స్‌	04

ప్రస్తుతం కళాశాలలో డిగ్రీ విద్యార్థుల సంఖ్య

బీఏ	126
బీకాం	238
బీఎస్సీ	206



కళాశాలలోని కంప్యూటర్‌ ల్యాబ్‌



కళాశాలలోని గ్రంథాలయం

పరిశోధన విద్యార్థులకు ప్రోత్సాహం



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంతో మంది విద్యార్థులు వివిధ విభాగాల్లోని అధ్యాపకుల పర్యవేక్షణలో పరిశోధనలు చేసి పట్టాలు పొందారు. కళాశల నుంచి పరిశోధనలకు అవకాశం, ప్రోత్సాహం కల్పిస్తున్నాం. ఎంతో మంది విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉన్నారు. తమ కళాశాల ఆధ్వర్యంలో వివిధ జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో 60కి పైగా పరిశోధనా పత్రాలు సమర్పించారు.

– డాక్టర్‌ ఎం. సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్‌

పీజీ విద్యకు అవకాశం :

కళాశాలలో ఎంకాం కోర్సును అందిస్తున్నారు. అలాగే మరిన్ని పీజీ కోర్సుల నిర్వహణ కోసం ఎస్వీ యూనివర్సిటీకి ప్రతిపాదనలు పంపారు. సైన్స్, సాంకేతిక, ఉపాధి కోర్సులకు డిమాండ్‌ ఉంది. కళాశాలలో జాబ్‌మేళాలు కూడా నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు.

27న సర్వసభ్య సమావేశం

కలికిరి: ఈ నెల 27న మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ నూర్జహాన్‌ అధ్యతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్‌ అమలులో ఉన్నందున సమావేశంలో అత్యవసర అంశాలపై మాత్రమే చర్చ జరుగుతుందని, సమావేశానికి మండల పరిధిలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరవ్వాలని కోరారు.

మదనపల్లె-1 డిపో మేనేజరుకు ప్రశంసా పత్రం



డీఎం వెంకటరమణారెడ్డిని అభినందిస్తున్న ఏపీఎస్‌ ఆర్టీసీ బోర్డు డైరెక్టర్‌ రాజారెడ్డి

పీలేరు రూరల్‌ : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆర్టీసీ ఆదాయానికి కృషి చేసిన మదనపల్లె-1 డిపో మేనేజరు వెంకటరమణారెడ్డికి ఏపీఎస్‌ ఆర్టీసీ బోర్డు డైరెక్టర్‌ ఎ. రాజారెడ్డి ప్రశంసాపత్రం అందజేశారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాలకు మదనపల్లె-1 డిపో పరిధిలో వివిధ సరీస్సులు నడిపి రూ. 16,27,978 ఆదాయం సాధించి, ఈపీకే 91.75, ఓఆర్‌ 171 సాధించినట్లు తెలిపారు. ఇందుకు కృషి చేసిన డిపో మేనేజరును అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీదే ఘనవిజయం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేవీపల్లె : వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధినేత, మన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలో పార్టీ ఘనవిజయం సాధిస్తుందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం కేవీపల్లెలో గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల ప్రముఖ సర్వే సంస్థలు నిర్వహించిన సర్వేలన్నింటిలో వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకే ప్రజల సంపూర్ణ మద్దతు ఉందని తేల్చి చెప్పాయని తెలిపారు. టీడీపీ నాయకుడు లోకేష్‌ చేపట్టిన పాదయాత్ర అట్టర్‌ప్లాప్‌ అయిందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబానికి ఏదోవిధంగా లబ్ధి చేకూరిందన్నారు. ఎంతో ఉన్నతాశయంలో గృహసారథులను తీసుకురావడం జరిగిందన్నారు. గృహసారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గ్రామ, మండల పార్టీ నాయకులతో కలసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రతి కుటుంబాన్ని నేరుగా కలసి ప్రభుత్వం వారికి అందించిన పథకాలు వివరించడం తోపాటు ప్రజల అభిప్రాయాలు సేకరించాలని కోరారు. గృహసారథులకు పార్టీలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని తెలిపారు. వచ్చే ఎన్నికలకు పార్టీ శ్రేణులంతా సంసిద్ధంగా ఉండాలని చెప్పారు. గత ఎన్నికల్లో కావాలి జగన్... రావాలి జగన్‌ నినాదంతో ఘన విజయం సాధించడం జరిగిందని, వచ్చే ఎన్నికల్లో 'మా నమ్మకం నీవే జగన్‌' నినాదంతో మరోసారి అఖండ విజయాన్ని సొంతం చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శ్రీనాథరెడ్డి, రాష్ట్ర మైనారిటీ కమిషన్‌ ఛైర్మన్‌ డాక్టర్‌ ఇక్బాల్‌అహ్మద్, నియోజకవర్గ పరిశీలకుడు సహదేవరెడ్డి, ఏపీ ఎండీసీ డైరెక్టర్‌ హరీష్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్‌ వెంకటరమణారెడ్డి, సచివాలయ మండల కన్వీనర్‌ సతీష్‌రెడ్డి, ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గజ్జెల శృతి, మాజీ ఏఎంసీ ఛైర్మన్‌ కడప గిరిధర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ జయరామచంద్రయ్య, పార్టీ యూత్‌ మండల కన్వీనర్‌ గజ్జెల శీన్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై కేసు

మదనపల్లె : వరకట్న వేధింపులపై వివాహిత ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్‌ ఏఎస్‌ఐ వెంకట్రమణ తెలిపారు. పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన జ్యోతిఅనితకు 2019లో బి.కొత్తకోట మండలం బండారువారిపల్లెకు చెందిన వెంకటేశ్వర్లుతో వివాహమైంది. వివాహ సమయంలో బంగారు నగలతో పాటు ఆరులక్షల కట్నం ఇచ్చారు. కొద్దిరోజుల పాటు వీరి కాపురం సజావుగా సాగింది. ఇటీవల కొంతకాలంగా మరో మూడులక్షలు అదనపు కట్నం తేవాలని అత్తింటివారు వేధించడం మొదలుపెట్టారు. దీంతో బాధితురాలు వారి వేధింపులు భరించలేక పుట్టింటికి వచ్చింది. బుధవారం అత్తింటి వారి వేధింపులపై టూటౌన్‌ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి భర్త వెంకటేశ్వర్లు, అతడి తల్లిదండ్రులు మునిరత్నం, సరస్వతి, సోదరుడు శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

లారీ వర్కర్స్‌ ప్రెసిడెంట్‌గా జింకా చలపతి



జింకా చలపతిని సన్మానిస్తున్న సభ్యులు

మదనపల్లె : ది మదనపల్లె లారీ, ఐషర్‌ వర్కర్స్‌ అసోసియేషన్‌ ప్రెసిడెంట్‌గా మున్సిపల్‌ వైస్‌ఛైర్మన్‌ జింకా చలపతి ఎన్నికయ్యారు. బుధవారం పట్టణంలోని బసినికొండలో మదనపల్లె లారీ డ్రైవర్స్, క్లీనర్స్‌ అసోసియేషన్‌ సమావేశం జరిగింది. కార్యక్రమంలో జింకా చలపతిని అధ్యక్షుడిగా, ఎస్‌.ఎల్‌.ఎస్‌.మగ్బూల్‌ను సెక్రటరీగా, మద్దుబావాజాన్‌ను జాయింట్‌ సెక్రటరీ, ఖాదర్‌బాషాను ట్రెజరర్‌ ఎన్నుకున్నారు. అలాగే మర్రిపాడు షబ్బీర్, రియాజ్‌ అహ్మద్, హుస్సేన్‌బాషా, అశోక్‌కుమార్‌నాయుడు, చంద్ర, మహమ్మద్‌షఫీ(బొంబాయి)ను వైస్‌ ప్రెసిడెంట్‌లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే సుఖప్రసవం



గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్‌ జవహర్‌బాబు

కలకడ : ప్రభుత్వ ఆసుపత్రుల్లో సుఖప్రసవం జరిగి, తల్లి–బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్‌ జవహర్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని ముడియంవారిపల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్‌ వైద్యసేవలు అందించారు. 52 మందికి సాధారణ చికిత్స చేసి మందులు అందజేశారు.ఆరుగురు గర్భిణులకు రక్తపరీక్షలు నిర్వహించారు. హైరిస్క్‌ ఉన్నట్లు గుర్తించి ఇద్దరు గర్భిణులకు పీలేరు ఆసుపత్రికి రెఫర్‌ చేయనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారం తీసుకోవాలన్నారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్నా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి రావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, సూపర్‌వైజర్‌ రెడ్డెమ్మ, జమీల్‌బాషా, రోజా, అనంతరాణి, గౌషియ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

బి.కొత్తకోట: ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ ధనుంజయులు కోరారు. బుధవారం మండల పరిషత్‌ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలతో ఎంపీడీఓ శంకరయ్య, ఎస్‌ఐ రామమోహన్‌లు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిషేధిత, అనుమతిలేని చోట సభలు, సమావేశాలు నిర్వహించరాదని చెప్పారు. సత్ప్రవర్తన కలిగిన వారినే పోలింగ్‌ ఏజెంట్లు నియమించాలన్నారు. ప్రచారం కోసం ప్రభుత్వ భవనాలు, ఆస్తులను వినియోగించరాదన్నారు. ప్రజాప్రతినిధులు పోలింగ్‌ ఏజెంట్లుగా ఉండకూడదని తెలిపారు. నియమ నిబంధనలను రాజకీయ పార్టీలకు తెలియజేయాలని కోరారు.

50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులు

కేవీపల్లె : మండలంలోని వడ్లకుంట, బండవడ్డిపల్లెకు చెందిన సుమారు 50 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం కేవీపల్లెలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో వడ్లకుంటకు మాజీ సర్పంచ్‌ వి. బాబురెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎం. జయన్న, నాయకులు నాగులయ్య, మనోహర్, మహేష్, సోమశేఖర్, మనోజ్, జయన్న, యశోధ, వెంకటరమణ, సుబ్రమణ్యం, తరుణ్‌కుమార్, బాబు, రెడ్డెప్ప, జయన్న, చంద్ర, రమణ, సోమశేఖర్, మల్లికార్జున, బండవడ్డిపల్లెకు చెందిన ఎ. అశోక, శ్రీనివాసులు, ఎ.యల్లయ్య, ఆనంద, డి. యల్లయ్య, ఎ. శ్రీనివాసులు కె. యల్లయ్య ఉన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, రాష్ట్ర మైనారిటీ కమిషన్‌ ఛైర్మన్‌ డాక్టర్‌ ఇక్బాల్‌ అహ్మద్, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు సహదేవరెడ్డి, ఏపీ ఎండీసీ డైరెక్టర్‌ హరీష్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్‌ ధనలక్ష్మి

వాల్మీకిపురం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని ఐసీడీఎస్‌ ప్రాజెక్టు డైరెక్టర్‌ ధనలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో వాల్మీకిపురం, గుర్రంకొండ, కలకడ, కలికిరి మండలాలకు సంబంధించిన అంగన్‌వాడీల సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులకు ఏడబ్ల్యూసీలో ప్రతి రోజు పాలు, గుడ్డుతో పాటు భోజనం తీసుకునే విధంగా చూడాలన్నారు. అలాగే నిత్యం గర్భిణులు కాల్షియం, ఐరన్‌ మాత్రలు తీసుకునేలా సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీల పరిధిలో బరువు తక్కువగా ఉన్న పిల్లలు, పొట్టిగా ఉన్న పిల్లలను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ భారతి, సూపర్‌వైజర్లు రోహిణి, యశోద, మహాలక్ష్మి, విజయలక్ష్మి, సుశీల, రాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

మొరుసు కాపులకు బీసీ సర్టిఫికెట్లు ఇవ్వాలని వినతి



తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న మొరుసుకాపు సంఘు నాయకులు

కురబలకోట: మొరుసు కాపు (వక్కలిగర) కులస్థులకు జీఓ 33 ప్రకారం బీసీ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరుతూ ఆసంఘ నాయకులు ఎం. ఆంజనేయరెడ్డి, కోళ్ల వాసుదేవరెడ్డి, ఎం. రమేష్‌రెడ్డి, మీసేవ రవి, వెంకటేశ్వర్‌రెడ్డి, ముత్ర దామోదర్‌ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దారు ఎం. భీమేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మొరుసుకాపురెడ్డి కులస్థులను బీసీ–బీ కేటగిరిలో చేరుస్తూ ప్రభుత్వం జీఓ 33 జారీ చేసిందన్నారు. బీసీ సర్టిఫికెట్లు ఇవ్వాలని కూడా సర్క్యులర్‌ జారీ చేశారన్నారు. ఇందుకు అనుగుణంగా జిల్లాలోని వివిధ తహశీల్దార్లు బీసీ–బీ కుల సర్టిఫికెట్లు ఇస్తున్నారన్నారు. తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు నియోజక వర్గాల్లో ఈ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వ ఆదేశాలు ఉన్నందున మొరుసు కాపులకు బీసీ సర్టిఫికెట్లు ఇవ్వడానికి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. విచారించి కుల సర్టిఫికెట్లు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు తెలిపారు. సర్పంచ్‌ సోమిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, అమరనాథరెడ్డి, శేఖర్‌రెడ్డి, హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శయనోత్సవం

రామసముద్రం: మండలంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం బల్లసముద్రం కొండపై వెలసిన శ్రీవాలీశ్వరస్వామికి ఘనంగా వసంతోత్సవం, శయనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. అలాగే మూగవాడిలో వెలసిన పుండీశ్వరస్వామికి వసంతోత్సవం, శయనోత్సవం నిర్వహించారు. గ్రామాల్లో స్వామివారికి ఘనంగా ఊరేగింపు చేశారు.

వైభవంగా గంగమ్మ జాతర

మదనపల్లె సిటీ : పట్టణంలోని బుగ్గకాలువలో వెలసిన శ్రీబాట గంగమ్మ జాతర మహోత్సవ వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. ఉదయం నుంచే భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పగలు తిరుణాల, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ధర్మకర్త బొగ్గిటి అలివేలమ్మ సౌకర్యాలు కల్పించారు.

ఆర్డీఓకు వినతి

మదనపల్లె : మండలంలోని కోళ్లబైలు పంచాయతీ అమ్మచెరువుమిట్టలో 2008లో ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు మంజూరైన తమకు నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అనుమతులు ఇవ్వాల్సిందిగా చేనేత కార్మికులు బుధవారం ఆర్డీఓ ఎం.ఎస్‌.మురళికి వినతిపత్రం సమర్పించారు.

• అ'పూర్వ' కలయిక



గుర్రంకొండ: స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్లో 1981–82 సంవత్సరంలో పదవ తరగతి చదువుకొన్న వారంతా బుధవారం అదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. 41 సంవత్సరాల తరువాత కలుసుకొని సందడి చేశారు. ఎక్కడెక్కడో స్థిరపడిన స్నేహితులను చూసి మురిసిపోయారు. అలనాటి జ్ఞాపకాలు, ముచ్చట్లు, అల్లరి పనులను నెమరు వేసుకొన్నారు. తమ కుటుంబ సభ్యుల్ని తమ సహచరులకు పరిచయం చేశారు. పాఠాలు చెప్పిన గురువుల కుటుంబ సభ్యుల్ని కలుసుకొన్నారు. తమకు పాఠాలు చెప్పిన గురువులతో పాటు తమతో పాటు చదువుకొని మృతి చెందిన 17 మంది సహచరులను తలుచుకొని వారి ఆత్మశాంతి కోసం అందరూ మౌనం పాటించి ప్రార్థనలు నిర్వహించారు.